జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శనివారం 4, ఏప్రిల్, 2026 | 11 పేజీలు



2 లో..

## నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి దశలవారీగా నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులను ఆదుకుంటాము
- ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి నిర్వాసితులు ఆందోళనకు గురి కావద్దు
- 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతాం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర ఏప్రిల్ 03:(ప్రజా జ్యోతి)** గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురవుతున్న నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకొని న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ఇండ్లు కోల్పోయి, పరిహారం

## కరీంనగర్‌లో కర్కశ తండ్రి దారుణం
### భార్యతో కలహం.. కవల బిడ్డలను హతమార్చిన తండ్రి





**కరీంనగర్ క్రైం,ఏప్రిల్ 03,ప్రజాజ్యోతి:** కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీ నగర్‌లో మానవత్వాన్ని కుదిపేసే దారుణ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.కన్నతండ్రే తన కవల ఆడపిల్లల ప్రాణాలు తీసిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.స్థానికులు సమాచారం ప్రకారం జూబ్లీ నగర్‌కు చెందిన కచ్చు శ్రీశైలం అనే వ్యక్తి భార్యతో కలహాల నేపథ్యంలో తన చిన్నారి కవల ఆడపిల్లలు అయిన గీతాన్,గీతాన్వికలను గడ్డి మందు తాగించి సమీపంలోని బావిలో పడేశాడు.ఈ ఘటన తెలిసిన వెంటనే గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో గాలింపు చర్యలు చేపట్టారు.గాలింపు సమయంలో ఒక చిన్నారి మృతదేహాన్ని వెలికితీశారు.మరో

2 లో..

- ఇద్దరు విద్యార్థుల మృతి,మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

### బొమ్మకల్ బైపాస్‌లో
## ఘోర రోడ్డు ప్రమాదం



**కరీంనగర్ క్రైం,ఏప్రిల్ 03,ప్రజాజ్యోతి:** బొమ్మకల్ బైపాస్ లో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు,మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి,రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అజ్మత్పురా నివాసి సయ్యద్ అత్యాబ్ (21),అబ్దుల్ రహమాన్ (19),మహమ్మద్ అద్నాన్(18),మహమ్మద్ అబ్రార్(20)అనే స్నేహితులు కలిసి గురువారం రాత్రి స్విఫ్ట్ డిజైర్ కారులో హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి బొమ్మకల్ బైపాస్ వైపు వెళ్తున్నారు.ఈ క్రమంలో వీ కన్వెన్షన్ సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి,స్థానికులు వెంటనే వారిని చికిత్స కోసం ఆసుపత్రులకు తరలించారు.చికిత్స పొందుతూ సయ్యద్ అత్యాబ్ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందగా,ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబ్దుల్ రహమాన్ రాత్రి ఒంటి గంట సమయంలో మృతి చెందినట్లు తెలిపారు,గాయపడిన అద్నాన్, అబ్రార్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. సమా చారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతు ల్లో సయ్యద్ అత్యాబ్ బీటెక్ విద్యార్థి కాగా, అబ్దుల్ రహమాన్ చదువుకు ఒటున్న విద్యార్థి తెలిపారు.



- 'రేవంత్ రెడ్డి పోవాలి' అనే పరిస్థితి వచ్చిందని విమర్శ - మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**జగిత్యాలప్రతినిధి,ఏప్రిల్3(ప్రజాజ్యోతి):** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాలలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగి రెండేళ్లు గడిచినా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చి ఏడాది దాటినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని, మొత్తం లక్ష కోట్లు కొట్టుకుపోయాయన్న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మూడు బ్యారేజీల

2 లో..



## మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకుంటే..
## తెలంగాణ ఎడారిగా మారుతుంది

# కరీంనగర్‌లో కర్కశ తండ్రి దారుణం

### భార్యతో కలహం.. కవల బిడ్డలను హతమార్చిన తండ్రి

మొదటి పేజీ తరువాయి

చిన్నారి కోసం ఇంకా తీవ్రంగా గాలిస్తున్నారు.చిన్నారుల మరణం గ్రామంలో విషాద ఛాయలు నింపింది. తల్లిదండ్రుల మధ్య తరచూ జరుగుతున్న గొడవలే ఈ దారుణానికి కారణమై ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు నిందితుడు శ్రీశైలంపై దాడి చేసి,అనంతరం అతన్ని పోలీసులకు అప్పగించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఘటనకు గల అసలు కారణాలను వెలికితీసే దిశగా విచారణ కొనసాగుతోంది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు,

## నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

మంజూరైన లబ్ధిదారులు శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నారాయణపూర్ గ్రామస్తులను దశలవారీగా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతామని తెలిపారు. రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం,బాబు మల్లేశం,బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్,రాగుల మల్లయ్య,నరాల శ్రీనివాస్,లోకిని తిరుపతి ,బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.

### మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకుంటే..

## తెలంగాణ ఎడారిగా మారుతుంది

మొదటి పేజీ తరువాయి

మేడిగడ్డ పిల్లర్లు కుంగి రెండేళ్లు గడిచినా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చి ఏడాది దాటినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని, మొత్తం లక్ష కోట్లు కొట్టుకుపోయాయన్న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మూడు బ్యారేజీల నిర్మాణ వ్యయం కేవలం రూ. 8 వేల కోట్లు మాత్రమేనని, వాటిని రూ. 500 కోట్లతో పునరుద్ధరించే అవకాశం ఉందని గుర్తు చేశారు.

వాతావరణం అనుకూలించకపోతే తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని, మేడిగడ్డను పట్టించుకోకపోవడం వల్ల మన నీళ్లు పోలవరం ప్రాజెక్టుకు వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ తలపెట్టిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును రీ-డిజైన్ చేస్తామని ఎన్నికల ప్రణాళికలో చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు మాత్రమే కేటాయించడం హాస్యాస్పదమన్నారు.

గతంలో కెసిఆర్ పోవాలని ప్రజలు కోరుకున్నారని, కానీ ఇప్పుడు రెండేళ్లలోనే 'రేవంత్ రెడ్డి పోవాలి' అనే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమవ్వడం రేవంత్ రెడ్డి నిర్లక్ష్య పాలనకు నిదర్శనమన్నారు.

తాను ప్రస్తుతం కాంగ్రెస్‌లో లేనని స్పష్టం చేసిన జీవన్ రెడ్డి, ఏ పార్టీలో చేరాలనేది తన అభిమానుల ఆలోచనల మేరకు నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. తనపై అభిమానం చూపుతున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు."విమర్శ ఒక్కటే జవాబు కాదు.. నిర్మాణాత్మకమైన ఆలోచన కావాలి. మేడిగడ్డను పునరుద్ధరించకపోతే 18 లక్షల ఎకరాల సాగునీరు, హైదరాబాద్ దాహార్తి, పారిశ్రామిక అవసరాలు ప్రశ్నార్థకమవుతాయి."

తన సహచరుడు గంగారెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రాకుండా అడ్డుకున్నారని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం వెనుక తనను రాజకీయంగా దెబ్బతీసే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. తెలంగాణ సమాజం ఈ నిర్లక్ష్యాన్ని క్షమించదని ఆయన హెచ్చరించారు..

## డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమిటీ ఎన్నిక

### చైర్మన్ గా కాంపెల్లి.రాజేశం

**ధర్మారం ఏప్రిల్03(ప్రజా జ్యోతి న్యూస్):** మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ధ్యాగేటి రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన జరుగు బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతోత్సవ వేడుకలకు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కమిటీలో చైర్మన్ గా కాంపల్లి రాజేశం,వైస్ చైర్మన్ సోగాల వంశీ, ప్రధాన కార్యదర్శి నారా ప్రేమ్ సాగర్,ప్రచార కార్యదర్శి జేరిపోతుల శేఖర్,కోశాధికారి బోల్లి సూర్యచరణ్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నారాయణపూర్ గ్రామస్తులను దశలవారీగా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతామని తెలిపారు. రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం,బాబు మల్లేశం,బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్,రాగుల మల్లయ్య,నరాల శ్రీనివాస్,లోకిని తిరుపతి ,బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.

# హైన దాడిలో లేగదూడలు మృతి

### ఘటన స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారి శేఖర్



**చిగురుమామిడి /ఏప్రిల్ 03(ప్రజా జ్యోతి)**

చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన గండికోట పెద్దశ్రీనివాస్ అనే రైతు వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో ఉన్న మూడు లేగదుడలపై,2మేకలపై హైనా దాడి చేసి హతమార్చినట్లు శుక్రవారం భాధిత రైతు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.లేగ దూడలపై హైన దాడి చేసిన సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలపడంతో వెంటనే స్పందించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన లేగ దూడలను,మేకలను పరిశీలించారు.ఘటన స్థలంలో ఉన్న అడుగులను హైనవిగా గుర్తించారు.రైతులు వ్యవసాయ పొలాల వద్ద లేగ దూడలను ఇనుపకంచే ఏర్పాటు చేసుకొని అందులో జాగ్రత్తగా వేసుకోవాలని రైతులకు వివరించారు.అడవి మృగాల దాడిలో మృతి చెందిన పశువుల ఆర్థిక సహాయం కోసం రైతులు మీ సేవలోనే దరఖాస్తు చేసుకోవాలని ఫారెస్ట్ అధికారి శేఖర్ తెలిపారు.6నెలల లేగదూడలు ఒక్కొక్కటి 15వేల రూపాయల చొప్పున దాదాపు 50వేలు,రెండు మేకలకు 16వేల వరకు నష్టపోయానని రైతు శ్రీనివాస్ తెలిపారు.ఇటీవలే రెండు లక్షల యాభై వేల రూపాయల అప్పు చేసి మూడు ఆవులను కొనుగోలు చేశాడని,ఆవుల లేగ దూడలపై హైన దాడి చేసి చంపడంతో రైతు శ్రీనివాస్ పరిస్థితి మరి దారుణంగా ఉందన్నారు.బాధిత పేద రైతు గండికోట శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా అన్ని రకాలుగా ఆదుకోవాలని రైతు కోరారు.

# వేములవాడ రూపురేఖలు మార్చడమే లక్ష్యం : పులకం రాజు



**వేములవాడ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వేములవాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 21వ వార్డులో నిర్వహిస్తున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ నరాల శేఖర్‌తో కలిసి ఆయన స్వయంగా పర్యవేక్షించారు. వార్డులోని మురికి కాల్వలను శుభ్రం చేసే పనులను దగ్గరుండి పరిశీలించిన చైర్మన్ మరియు వైస్ చైర్మన్ పనుల నాణ్యతపై కార్మికులకు మరియు మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పర్యవేక్షణలో మరియు ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఎక్కడా మురుగు నీరు నిలవకుండా, దోమల వ్యాప్తి జరగకుండా ముందస్తుగా కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు వివరించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక ద్వారా క్షేత్రస్థాయి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం వైస్ చైర్మన్ నరాల శేఖర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సహకారంతో 21వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. వార్డులోని ప్రతి వీధిలో పారిశుధ్య సమస్యలు లేకుండా చూడటమే తమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ 'ప్రజాపాలన' లక్ష్యాలకు అనుగుణంగా వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రేమ, కరుణయే.. యేసుక్రీస్తు జీవిత సందేశం

### - గుడ్ ఫ్రై డే వేడుకల్లో పాస్టర్ జోజీ



**జమ్మికుంట,ఏప్రిల్03 ( ప్రజాజ్యోతి ) :** సమస్త మానవాళికి ప్రేమ పంచాలని, శత్రువుల పట్ల క్షమా గుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు తన త్యాగం ద్వారా మానవాళికి ఇచ్చిన సందేశమని, అందుకే ఈ శుభ దినాన్ని శుభ శుక్రవారంగా చెప్పుకుంటారని పాస్టర్ జోజి అన్నారు. శుక్రవారం జమ్మికుంట మునిసిపాలిటీ పరిధిలో గెత్సమనే ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రై డే సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఉదయం నుండి ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త మానవాళి కోసం ఏసుక్రీస్తు సిలువ వేయబడిన శుక్రవారంగా గుడ్ ఫ్రైడే గా క్రైస్తవులంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారని వివరించారు. ప్రతీ ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమానురాలతో ఉండాలని, జాలి, దయ, కరుణ అనే మార్గాల్లో పయనించాలని ఏసుక్రీస్తు మానవాళికి దారి చూపించారని తెలిపారు. ప్రపంచానికి శాంతిని పంచేందుకు ఏసుక్రీస్తు త్యాగం చేశారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కొండయ్య, రామనాథం, మొగిలిలు పాల్గొన్నారు.

# కే డి సి సి బ్యాంక్ మేనేజర్ రఘునాథ్ శర్మ ఘన సన్మానం

**ముస్తాబాద్, ఏప్రిల్ 3( ప్రజా జ్యోతి ):**

కే డి సి సి బ్యాంక్ అవునూర్ బ్రాంచ్ మేనేజర్‌గా సేవలందించిన శ్రీ భాయీ రఘునాథ్ శర్మ పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ రెడ్డబోయిన గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ, రఘునాథ్ శర్మ సేవలను కొనియాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనేక సంవత్సరాల పాటు నిజాయితీగా, బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని తెలిపారు. ఆయన సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.




తదనంతరం రఘునాథ్ శర్మ ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, బ్యాంకు సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శర్మ కు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొము రయ్య జయంతి.

**వేములవాడ ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి**



భూమి కోసం,భూక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సా యుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య తెలంగాణ గడ్డపై అణచివేతకు వ్యతిరేకంగా గళ మెత్తిన తొలివీరుడు తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరు డు,నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి,తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపిరిలూదిన మహనీయుడు .నిజాం నిరంకు శత్వానికి వ్యతి రేకంగా పోరాడిన ధిక్కార పతాక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుడు శ్రీ దొడ్డి కొము రయ్య గారి జయంతి సందర్భం గా ఆ వీరయోధుడికివేములవాడ బీసీ సాధికారిత సంఘం కార్యాల యంలో రాష్ట్ర గౌరవఅధ్యక్షులు కొండా దేవయ్య కార్యదర్శి పొలా స నరేందర్ లు జోహార్లు అర్పిం చారు

# భక్తులకు చల్లని త్రాగునీరు అందించేందుకు భీమేశ్వర ఆలయంలో చలివేంద్రం ప్రారంభం

**వేములవాడ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి**

వేములవాడలోని శ్రీ రాజరా జేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు చల్లని త్రాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన జల ప్రసాద కేంద్రం ప్లాంట్ ద్వారా కూలర్లకు నల్లల ద్వారా త్రాగునీరు అందిస్తూ భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నారు.

అలాగే సేవా వాలంటీర్ల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో కూల్ బబుల్స్ ఏర్పాటు చేసి భక్తులకు సులభంగా నీరు అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నటరాజ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ప్రారంభించారు.



వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా అవసరాన్ని బట్టి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు, అలాగే విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి త్రాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా వాలంటీర్లు పాల్గొన్నారు

# నిషేదిత పురుగుల మందులు అమ్మితే కఠిన చర్యలు



**శంకరపట్నం ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో పలు ఫర్టిలైజర్స్ షాపుల్లో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తనిఖీలు చేశారు అత్యంత విషపూరితమైన పారా క్వాటు డైక్లోరైడ్ వాడడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందని ఆమె తెలిపారు ఈ మందు ప్రాణాపాయానికి దారితీస్తుందని దీన్ని నిలువ పంపిణీ తయారీ లేదా అమ్మకాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఇ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు

# మారనున్న గుడి చెరువు రూపురేఖలు.



**వేములవాడ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి**

వేములవాడ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో పట్టణాభివృద్ధిపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సాదించింది. ముఖ్యంగా రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచేలా గుడి చెరువును అభివృద్ధి చేసే పనులు వేగవంతమయ్యాయి. చెరువులోకి పట్టణంలోని మురికి నీరు చేరకుండా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు గుడి చెరువు నుండి మూల వాగు వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పవిత్రమైన గుడి చెరువు కలుషితం కాకుండా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే చొరవతో భారీ నిధులతో డ్రైనేజీ మళ్లింపు పనులు చేపట్టామన్నారు. పనులు పూర్తయిన తర్వాత గుడి చెరువు పర్యాటక కేంద్రంగా మారుతుందని, పట్టణ సుందరీకరణలో ఇది కీలకమని ధీమా వ్యక్తం చేశారు. వార్డుల వారీగా సమస్యల పరిష్కారంతో పాటు పట్టణ ప్రాముఖ్యత ఉన్న ప్రాంతాలను ఆధునీకరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ తనిఖీలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, 17వ వార్డు కౌన్సిలర్ ముత్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుని మృతి

**చొప్పదండి, ఏప్రిల్ 3 ( ప్రజాజ్యోతి):**



చొప్పదండి పట్టణానికి చెందిన ప్రముఖ పాత్రికేయుడు సంభోజి శేఖర్ (48) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. శుక్రవారం ఉదయం వేకువ జామున చాతిలో నొప్పి రావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సేవలందిస్తున్న శేఖర్ హఠాన్మరణం పట్ల పలువురు తమ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన భౌతిక కాయానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రు.20,000 ఆర్థిక సాయం అందించారు. ధైర్యాన్ని కోల్పోవద్దని కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ భౌతిక కాయానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

# ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి గరుడోత్సవం

**గంభీరావుపేట ఏప్రి ల్ 3 (ప్రజా జ్యోతి):**



గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోజున ఉదయం హోమం , బలిహరణం లో భక్తులు పాల్గొన్నారు, ఎనిమిదవ రోజు స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం నుండి బయలుదేరినస్వామివారిని ఉదయం గరుడ వాహనంపై సీతారామస్వామి ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు పెద్ద ఎత్తున భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి మంగళ హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని కట్న కానుకలు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకున్నారు.

## మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పుణ్య తిథి (వర్ధంతి)




**వేములవాడ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి**

చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 3న జరుపుకుంటాము శివాజీ మహారాజ్ ఏప్రిల్ 3 1680 రాయగడ కోటలో తుది శ్వాస విడిచారు అతను హిందూ సామ్రాజ్య స్థాపకుడు అత్యంత ధైర్య సాహసాలు యోధుడు గొప్ప పరిపాలకుడిగా ప్రజల మనసులో నిలిచిపోయారు ఆయన జీవించిన కాలం లో ఎక్కువ భాగం యుద్ధాలలోనే 27 ఏళ్ల పాటు గడిపాడు హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడు మరాఠ సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ధీరో దాత్తుడు చత్రపతి మూడు వారాలపాటు తీవ్ర జ్వరంతో బాధపడి ఏప్రిల్ 3న 1680లో మధ్యాహ్నం 12 గంటలకు రాయగడ కోటలో స్వర్గస్తులైనారు వారిని జయంతి సందర్భంగా వర్ధంతి సందర్భంగా అందరం నివాళులర్పించి హిందూ ఐక్యత కొరకు కృషి చేసిన నాయకునికి నివాళు లర్పిద్దాం

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



**రామడుగు, ఏప్రిల్ 3(ప్రజా జ్యోతి)**

దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలి వద్ద కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనజ- నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, కురుమ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**ముస్తాబాద్, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**



ముస్తాబాద్ మండల కేంద్రంలో అమరవీరుడు దొడ్డి కొమురయ్య 119వ జయంతి మహోత్సవాన్ని శ్రీ కృష్ణ యాదవ సంఘం మండల అధ్యక్షులు రాగం నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ కుల బాంధవులు మరియు ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి , సెస్డైరెక్టర్ సందు పట్ల అంజి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్ల బాల్ రెడ్డి , నరసింహారెడ్డి , సర్వర్ , వివిధ గ్రామాల పెద్దలు, సిడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గీస బిక్షపతి, కోఢశీను, శీలం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అపర భద్రాద్రిలో చంద్ర రథోత్సవానికి సిద్ధం

### ఇల్లందకుంటలో విస్తృత ఏర్పాట్లు

### - భారీగా తరలిరానున్న భక్తులు

**ఇల్లందకుంట, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి) :**

అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే చంద్ర రథోత్సవం (పెద్ద రథం) కోసం దేవస్థానం సర్వసన్నద్ధమైంది. ఈ ఉత్సవాన్ని దర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, కార్యనిర్వాహణ అధికారి సుధాకర్, కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైట్ పాండాల ఏర్పాటు చేశారు. త్రాగునీటి సదుపాయం, ప్రాథమిక వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.



శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు స్వామివారు చంద్రరథంపై ఆశీనులై భక్తులకు దర్శనవి ంవ్వనున్నారు. అనంతరం మధ్యాహ్నం 4 గంటల తర్వాత ఒగ్గు కళాకారుల ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. తరువాత భక్తుల జయజయధ్వానాల మధ్య పెద్ద రథోత్సవం దేవస్థానం మాడవీధుల గుండా ఘనంగా ఊరేగింపుగా సాగనుంది.

ఈ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు సులభంగా చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాల పరమేష్, కిరణ్, చిరంజీవి, గోపాల్ కిషన్, ఆలయ అధికారులు మోహన్, సురేందర్, మల్లారెడ్డి, గ్రామ ప్రముఖులు రామ్ రెడ్డి పాల్గొన్నారు

# వైభవంగా సూర్య రథోత్సవం



**ఇల్లందకుంట, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి):**

అపర భద్రాద్రి ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సూర్య రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఐదు గంటలకు శకటోత్సవం (బండ్ల తిరుగుట) నిర్వహించారు. అనంతరం అర్చకులు వంశధారాచార్యులు స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తర్వాత మాడ వీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి, చిన్న రథంపై (సూర్య రథం) శ్రీ సీతారామచంద్రస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు క్యూ లైన్లలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఇదిలా ఉండగా, ఇల్లందకుంట శ్రీ రామదూత సేవాసమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ సీతారామచంద్రస్వామి, హనుమంతుని వేషధారణలో ఊరేగింపుగా పాల్గొని ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కందుల సుధాకర్, దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ ధర్మకర్తలు, సర్పంచ్ దార సురేష్, కదారి కుమారస్వామి, కందాల కొమురెల్లి, ఆలయ సిబ్బంది మోహన్, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు

## ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు గురికావద్దు

**పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి):**



పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయిస్తామని చెప్పే ఏజెంట్లను నమ్మి ఎవరూ మోసపోవద్దని పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రజలకు సూచించారు. జిల్లాలో ఏ బిల్లులు కూడా జిల్లా స్థాయిలో మంజూరు కావని ప్రజలు గమనించాలన్నారు. కొంతమంది మధ్యవర్తులు డబ్బులు తీసుకుని మోసం చేసే అవకాశం ఉన్నందున అలాంటి వారి మాటలు నమ్మి ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని నిరుద్యోగులకు సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కేవలం వారధి సొసైటీ ద్వారానే, గౌరవ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగ ఆశావహులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న వారధి కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు వారికి సమాచారం అందజేయబడుతుందని చెప్పారు.

పెద్దపల్లి జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ



**కోనరావుపేట,ఏప్రిల్.03(ప్రజా జ్యోతి)**

కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో గొర్రెల కాపరులైన కుమ్మం మొండయ్య, ముడికే లక్ష్మీరాజంలు గొర్రెలకు స్నానం చేయిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య,కొనరావుపేట సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షులు అనుపాటి భూంరెడ్డి,డైరెక్టర్ పొట్లపల్లి సత్యనారాయణరావు, గ్రామశాఖ అధ్యక్షులు నాగుల రాజు, వార్డ్ మెంబెర్ గంగుల ప్రశాంత్, మాజి సర్పంచ్ గున్నాల అరుణ లక్ష్మన్, పొన్నం పర్శరాములు, కొమ్ము ఎల్లయ్య, గోపాల్ రావు, బుగ్గయ్య, ముడికే మల్లయ్య, అసరి వెంకటేశం, అసరి ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**గత పది ఏళ్లలో ఒక్క సబ్ స్టేషన్ తీసుకరాలేదు.**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కొనరావుపేట, ఏప్రిల్. 03(ప్రజా జ్యోతి)**

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..శుక్రవారం కొనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో నూతన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు.. అనంతరం మండల కేంద్రంలో మండల కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆవిష్కరించారు..

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతును రాజుగా చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్ అందించేందుకు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఇప్పటికీ కొనసాగుతుండటం రైతు సంక్షేమానికి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆ పథకం వల్ల చిన్న, సన్నకారు రైతులు ఎంతో లాభపడుతున్నారని తెలిపారు.



ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్యలను పూర్తిగా నివారించి, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. మరిమడ్లలో నిర్మించబడుతున్న 33/11 కేవీ ఉప కేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడటమే కాకుండా, ట్రిప్పింగ్ సమస్యలు తగ్గి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుతుందని వివరించారు.

రైతులు సాగునీటి కోసం విద్యుత్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో, పంటల సమయంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

గ్రామాలకు దూరంగా ఉన్న ఇండ్లకు కూడా సౌకర్యవంతంగా విద్యుత్ మీటర్లను అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని, పంచాయతీ కార్యదర్శి అనుమతితో మీటర్ మంజూరు చేసే ప్రక్రియను సరళీకృతం చేసినట్లు చెప్పారు.

వేములవాడ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 10 నూతన, రాజన్న ఆలయనికి ప్రత్యేక సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదనంగా రుద్రంగి వద్ద 132కేవీ, కథలపూర్ లో 220 కేవీ హై కెపాసిటీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మొత్తంగా నియోజకవర్గంలో 14 సబ్ స్టేషన్ల అభివృద్ధికి ఆమోదం లభించిందని తెలిపారు.

గత పాలకులు పదేళ్ల కాలంలో ఒక్క సబ్ స్టేషన్ కూడా మంజూరు చేయలేకపోయారని ఆరోపించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగంలో విస్తృత మార్పులు తీసుకువస్తోందన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపిరులూదిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. సాయుధ పోరాట కాలంలో ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని, నేటి తరానికి ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై అణచివేతకు వ్యతిరేకంగా గళమెత్తిన తొలి వీరుడి విగ్రహాన్ని కోనరావుపేటలో ప్రతిష్టించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య ,వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు చేపూరి గంగాధర్ గుప్తా, మండల అధ్యక్షులు ఫిరోజ్ పాషా, సర్పంచులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమా, మాజీ జెడ్పిటిసి లు బండ నరసయ్య యాదవ్, గొట్టె రుక్మిణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాసెట్టి నాగరాజు, అజీమ్ పాషా, వెంగలి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నల్లగొండ నరసింహస్వామి టెంపుల్ చైర్మన్ లక్ష్మణ్ ను పరామర్శించిన కవ్వంపల్లి



**తిమ్మాపూర్ ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి)**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మెన్ బండారిపల్లి లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికాగా మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. కరీంనగర్ లోని లక్ష్మణ్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులు,ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.లక్ష్మణ్ ను పరామర్శించిన వారిలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్,పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కంది అశోక్ రెడ్డి, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

# ఖిలావనపర్తి గ్రామంలో సీసీ రోడ్డుకు భూమిపూజ



**ధర్మారం ఏప్రిల్ 03(ప్రజా జ్యోతి న్యూస్):**

మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ శుక్రవారం సీసీ రోడ్డుకు భూమిపూజ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మోతె కనకయ్య నిర్వహించారు.గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేగుల హరీష్,తోడేటి సాగర్, తాళ్ళపెల్లి భాస్కర్,పాలగాని వనిత-రాజమల్లు,జెంగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.అలాగే గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

# మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

**పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి):**

ఏప్రిల్ మాసంలో జరగనున్న మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్క చంద్రమౌళి, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు కుమ్మరి అంజయ్య మరియు ఇతర నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 5న జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 11న జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగే కార్యక్రమాలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలందరూ స్వచ్ఛందంగా జయంతి ఉత్సవాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# దుద్దిల్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా మేఘ కంటి వైద్య శిబిరం

**సమాజ సేవలో దుదిళ్ళ శ్రీపాద రావు పాత్ర చిరస్మరణీయం**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ముత్తారం, ఏప్రిల్ 03(ప్రజా జ్యోతి)**

సమాజ సేవలో దుదిళ్ళ శ్రీపాద రావు పాత్ర చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం దుద్దిళ్ళ శ్రీపాదరావు 27వ వర్ధంతి పురస్కరించుకొని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు ముత్తారం మండలంలో హైదరాబాద్ పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం, కంటి శస్త్రచికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,డిసిపి రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిళ్ళ శ్రీపాదరావు అని పేర్కొన్నారు.

శ్రీపాదరావు చూపిన మార్గంలోనే వారి



కుటుంబ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు.పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప కార్యక్రమమని కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కంటి పరీక్ష చేయించుకున్నారు.ఈ శిబిరంలో వైద్యులు ఆధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారని,ఈ సేవల వల్ల అనేక మంది పేద ప్రజలు లబ్ధి పొందినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్, సిఐ రాజు గౌడ్, ఎస్సై ఎన్. రవికుమార్, ఎంహెచ్ఓ ప్రమోద్ కుమార్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్,జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,మండల అధ్యక్షుడు దొడ్ల బాలాజీ, మండల నాయకులు,సీనియర్ నాయకులు,యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రగతి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




**రామగిరి, ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి) :**

స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ప్రగతి పాఠశాల ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించగా, జేఎన్టీయూహెచ్ ప్రిన్సిపల్ డా. బి.విష్ణువర్ధన్, ఎంఈఓ కొమురయ్య, టిబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, నాగరాజ కుమారి, పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి పాల్గొని పీపీ-2 మరియు 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా డా.విష్ణువర్ధన్ విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించగా, అంగులీయ అబాకస్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులను మిర్యాల రాజిరెడ్డి సత్కరించారు. అబాకస్ శిక్షణ పిల్లల్లో జ్ఞాపకశక్తి, తార్కికత పెంపొందిస్తుందని పేర్కొంటూ, భవిష్యత్తులో వారు గొప్ప గణిత శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అభినందించారు. అబ్బు కేశవరెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో గణితంపై పట్టు సాధించేందుకు అబాకస్ ఎంతో ఉపయోగకరమని, విద్యార్థుల విజయాలు పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ కొప్పుల గోవర్ధన్ రావు, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హోలీ షాలోమ్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు



**చొప్పదండి, ఏప్రిల్ 3 ( ప్రజాజ్యోతి):**

చొప్పదండి హోలీ షాలోమ్ చర్చి లో శుక్రవారం గుడ్ ఫ్రై డే సందర్భంగా ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. బిషప్. డా. గుండేటి శాంతి కుమార్ మాట్లాడుతూ యేసుక్రీస్తు ప్రపంచంలోని సర్వ మానవాళి పాప క్షమాపణ కోసం 2000 సం:ల క్రితం కలు వరి సిలువలో తన రక్తం చిందించి ప్రాణం పెట్టాడని చెప్పారు. మానవులందరూ క్షమించు గుణం, ప్రేమించే మనస్తత్వం, అందరి క్షేమము కోరి ప్రార్థన చేసేవారిగా శాంతి సమాధానం తో బ్రతకాలి అని సందేశం ఇచ్చారు. వందలాదిగా భక్తులు హాజరై ప్రభువు దీవెనలు పొందారు.

## వృంద ఆసుపత్రి ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు

**పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 3 అక్షరం న్యూస్;**



పెద్దపల్లి పట్టణంలోని కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వృంద ఆసుపత్రిని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే విజయరమణరావుకు ఆసుపత్రి నిర్వాహకులు వినయ్ కుమార్ రెడ్డి, స్వాతి రెడ్డి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# రమణీయం... రథోత్సవం...

**-రామనామస్మరణతో మార్మోగిన రాములగుట్ట**

**-భక్తజనంతో పులకించిన మామిడిపల్లి...**

**కొనరావుపేట, ఏప్రిల్,03(ప్రజా జ్యోతి)**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయం అయిన మామిడిపల్లి శ్రీసీతారామస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన రథోత్సవం అత్యంత రమణీయంగా సాగింది. శు క్రవారం చైత్ర పౌర్ణమి సందర్భంగా రథోత్సవం నిర్వహించగా రాములగుట్ట భక్తజనంతో పులకించిపోయింది. భక్తుల జేజేలు, జయజయ ధ్వానాల మధ్య రామనామస్మరణ మార్మోగింది. యాజ్ఞచార్యులు మరిగంటి రామగోపాలచార్యులు, అర్చకులు రంగనాయకుల శ్రీనివాస్, తిరునహరి కృష్ణ స్వామి, లక్ష్మణ్‌లు వేకువజామునే స్వామివారిని మేల్కొల్పి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలకంరించారు. అనంతరం సుందరాంగుడు రామయ్యను, ముగ్ధ మోహనురాలు సీతమ్మను పల్లకీలో తీసుకువెళ్లి రంగురంగుల పూలతో ముస్తాబు చేసిన రథంపై ఆశీనులు చేశారు. వివిధ గ్రామాల నుండి అశేషంగా తరలివచ్చిన భక్త జనవహిని రథంపై ఉన్న స్వామివారిని దర్శించుకొని అనాధిగా వస్తున్న ఆచారంలో భాగంగా రథంపై రూపాయి పెట్టి స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రధాన ఆలయం నుంచి గుంటి హనుమాన్ దేవాలయం వరకు రథాన్ని లాగుతూ డీజే



పాటలు, యువకుల నృత్యాలు, మహిళల కోలాటాలు, శ్రీరామంజనేయ దీక్షాపరుల భజనల సంకీర్తనలతో తరలివెళ్లి అత్యంత వైభవోపేతంగా అపురూప రథోత్స ఘట్టాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళలో పుష్పయాగం నిర్వహించి ఉత్సమూర్తులను రాములగుట్టపైకి తీసుకువెళ్లి ఏకాంత సేవతో బ్రహోత్సవాలను ముగించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ కాసర్ల పవిత్ర, వార్డు సభ్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, శ్రీరామంజనేయ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

# వేములవాడ నుండి కాళేశ్వరం, యాదగిరిగుట్టలకు కొత్త బస్సు సర్వీసులు..

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నేడు ప్రారంభం**

**వేములవాడ,ఏప్రిల్03:ప్రజాజ్యోతి.**

వేములవాడ రాజన్న క్షేత్రం నుండి రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాళేశ్వరం మరియు యాదగిరిగుట్టలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం... టీజీఎస్ఆర్టీసీ నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నూతన బస్సులను శనివారం ఉదయం 10:30 గంటలకు వేములవాడ బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వేములవాడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ .. కాళేశ్వరం వెళ్లే బస్సు ప్రతిరోజూ ఉదయం 6:30 గంటలకు వేములవాడలో బయలుదేరి 10:50 గంటలకు చేరుకుంటుందని, తిరిగి ఉదయం 11:20 గంటలకు అక్కడ బయలుదేరి మధ్యాహ్నం 3:35 గంటలకు వేములవాడ చేరుకుంటుందని తెలిపారు.

ఈ సర్వీసుకు పెద్దలకు రూ. 230, పిల్లలకు రూ. 120 చార్జీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా యాదగిరిగుట్టకు ప్రతిరోజూ రెండు ట్రిప్పులు నడపనున్నట్లు ఆయన వివరించారు. మొదటి ట్రిప్పు ఉదయం 6:45 గంటలకు, రెండో ట్రిప్పు మధ్యాహ్నం 2:15 గంటలకు వేములవాడ నుండి బయలుదేరుతాయని తెలిపారు. ఈ సర్వీసుకు పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ. 120 చార్జీ ఉంటుందని వెల్లడించారు. వేములవాడ, సిరిసిల్ల పట్టణ ప్రాంత




ప్రజలతో పాటు,పరిసర గ్రామాల భక్తులు ఈ మెరుగైన రవాణా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# పండిట్ దిన్ దయాల్ ఉపా ధ్యా ప్రశిక్షణ తరగతులు ప్రారం భించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామక్రిష్ణ.

**వేములవాడ,ఏప్రిల్,3:ప్రజాజ్యోతి**

వేములవాడ పట్టణం లో పట్టణ శు క్రవారం రోజు నుండి శనివారం రోజువరకు బిజెపి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యా య ప్రశిక్షణ తరగతులు జరుగు చున్నాయి ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రపంచం లో నే అతిపెద్ద మరియు క్రమశిక్షణ కలిగిన పార్టీగా బీజేపీ ఉందని అన్నారు ఈ శిక్షణ తరగతులు ఈ రోజు రేపు కొనసాగుతాయని అన్నారు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ మనశీ బీజేపీ పార్టీ లో ఉండడం గొప్పతనం గా భావించాలి ఎలాంటి స్వార్థలు లేని రాజకీయ పార్టీ జనసంఘ్ పార్టీగా 2 సీట్లతో మొదలైన పార్టీ ఈ రోజు భారత దేశం లో అధికారం లోకి రావడం మన పార్టీ క్రమశిక్షణ కు నిదర్శనం అన్నారు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా అధికారం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు ముఖ్య అతిథి గా విచ్చేసిన మోహన్ రెడ్డి మాట్లా డుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పాటుపడిన నాయకుల గురించి అందరికీ తెలిసిన



విషయం అ న్నారు పండిట్ దీన్ దయాల్ చరిత్ర గురించి అందరికీ విఫులంగా తెలియచేశారు వారి సేవలను కొనియాడారు ప్రపంచలో అతి పెద్ద పార్టీగా ఎదగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియచేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, లింగంపల్లి శంకర్ కౌన్సిలర్స్ చిన్న ముత్యం, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ నాయకులు రేగుల మల్లికార్జున్ కోలా కృష్ణ స్వామి, రేగుల శ్రీకాంత్ మామిళ్ళ లక్ష్మీరాజ్యం పిన్నింటి హనుమాన్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి వివేక్ రెడీ ఉపాధ్యక్షులు మెరుగు లక్ష్మణ్, అన్నం నరసయ్య కొన్నాళ్ల రఘుపతి, గుడిసె మనోజ్, నామాల శేఖర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# సింగరేణి నిర్లక్ష్యం 25 లక్షల వృథా..

**- బీజేపీ నేత మొలుమూరి శ్రీనివాస్ ఆగ్రహం**

**- ఆరు ఏళ్ళైనా ప్రారంభం కాని మటన్, చికెన్ కాంప్లెక్స్**

**రామగిరి, ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి) :** సెంటెనరీ కాలనీలో కార్మికుల సంక్షేమం పేరిట సింగరేణి యాజమాన్యం సుమారు □25 లక్షల వ్యయంతో ఆరు సంవత్సరాల క్రితం నిర్మించిన మటన్--చికెన్ షాపుల సముదాయం ఇప్పటికీ ప్రారంభం కాకుండా నిర్లక్ష్యంగా పడి ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బీజేపీ నాయకుడు మొలుమూరి శ్రీనివాస్ మండిపడ్డారు. కార్మికుల కష్టార్జిత శ్రమతో కంపెనీ లాభాలు పొందుతుండగా, అదే కార్మికుల సంక్షేమం కోసం నిర్మించిన సౌకర్యాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడం పట్ల నిర్లక్ష్యానికి స్పష్టమైన ఉదాహరణ అని విమర్శించారు. నిర్మాణం పూర్తై సంవత్సరాలు గడిచినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సముదాయ నిర్మాణం ప్రస్తుతం ఖాళీగా ఉండి అ న ా ం ఎ. ి ు క కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ఇది కార్మిక కుటుంబాల భద్రతకే ముప్పుగా మారుతోందని తెలిపారు. "సంక్షేమం పేరుతో నిర్మించి గాలికి వదిలేయడమేనా పరిపాలన?" అంటూ ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్య నిర్ణయాల సింగరేణి సంస్థపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని వెంటనే సరిచేసి



మటన్--చికెన్ కాంప్లెక్స్ ను ప్రారంభించాలని, లేదంటే ఆర్జీ-3 జీఎం కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ అంశాన్ని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో పాటు సింగరేణి సిఎండి, డైరెక్టర్ (పా)లకు అధికారికంగా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో ఇలాంటి వృథా ప్రాజెక్టులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, కార్మికుల కోసం నిర్మించిన ప్రతి సౌకర్యం వినియోగంలోకి రావాల్సిన బాధ్యత అధికారులదేనని డిమాండ్ చేశారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

**ఐడీఓసీలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు**

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఏప్రిల్ -3 (ప్రజాజ్యోతి )**

పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించగా, అదనపు కలెక్టర్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి అధికారులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శరత్, ఎగుట్ల కనకయ్య, నాగం కుమార్, చిమల్ల మల్లేశం,స్తంబ లచ్చయ్య , వేముల



నాగరాజు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎలక్షన్లలో ఇచ్చిన హామీ నెరవేర్చిన సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి..



**ముత్తారం మార్చి, 03 (ప్రజా జ్యోతి)**

మండలంలోని ఓడేడు గ్రామంలో సర్పంచ్ ఎలక్షన్లలో కళాధర్ కాలనిలో గత కొన్ని సంవత్సరాల నుండి త్రాగు నీరు సమస్యతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని కవిత కిషన్ రెడ్డి కి వర్డ్ సభ్యులు తెలిపారు. గెలిచిన వెంటనే త్రాగునీరు సమస్య తీరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. శుక్రవారం రోజు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన బోర్ కి మోటరు పెట్టించి తాగునీరు సమస్యన తీర్చారు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు కళాధర్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ దాసరిప్రశాంత్ గౌడు, వార్డ్ మెంబర్ కొలిపాక లక్ష్మి చంద్రయ్య, పూదరి స్వప్న మహేందర్, కాలనీవాసులు పోలం చిరంజీవి, కూన రాజేందర్, కూన దేవేందర్, బెల్లంకొండ సుమన్, పొలం స్వామిరాజ్,తిరుపతి, బొడ్డు గణేష్, తదితరులు పాల్గొన్నారు

# పాపయ్యపల్లె గ్రామంలో 5 లక్షతో సీసీ రోడ్డుకు భూమి పూజ



**తంగళ్ళపల్లి ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

తంగళ్ళపల్లి మండలం పాపయ్యపల్లె గ్రామానికి ఎన్ఆర్ ఈ జి ఎస్ పథకం కింద రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును సర్పంచ్ చెన్నవేని పరుశురాములు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నవేని పరుశురాములు,ఉపసర్పంచ్ గోగు అనిల్,వార్డు సభ్యులు బొజ్జ దేవరాజు,కోస్ని తనుశ్రీ,బొజ్జ దేవరాజు(జయన్న),చెన్నవేని తిరుపతి గ్రామస్తులు ఎరెడ్డి వెంకట్ రెడ్డి,గంభీరావుపేట పరుశురాములు,బుర్ర నాగయ్య,బొజ్జ వివేక్,బొజ్జ వంశీకృష్ణ,గంభీరావుపేట మహేష్,చెన్నవేని తిరుపతి,సోల్ల లచ్చయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు శ్రీధర్ రావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# చెన్న కేశవ స్వామిని దర్శించుకున్న మద్దుల గోపాల్ రెడ్డి

**ఎండపల్లి, ఏప్రిల్ 03,ప్రజా జ్యోతి**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని గోడిసెల పేట గ్రామంలోని చెన్నకేశవ స్వామిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారూ,స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండి స్వామివారి కరుణ కలగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. దీనికి ముందు ఆలయ ప్రాంగణంలో కలివిడిగా భక్తులతో కలిసి సంభాషించారు వీరి వెంట,గ్రామ సర్పంచ్ కందికట్ల అమృత రాజేష్ ఆలయ కమిటీ చైర్మన్ సబ్బు కేశవ్ ,పాతగూడూర్ సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, పడకల్ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్ మారేడుపల్లి సర్పంచ్ బాలసాని శారద మల్లేష్ గౌడ్ చర్లపల్లి సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి శానబండ సర్పంచ్ గాదం భాస్కర్ సూరారం సర్పంచ్ కోడిపెల్లి కొమురమ్మ శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



# వివాహానికి ఆర్థిక చేయూత



**మేడిపల్లి ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన పెండెల సుగుణ కుమారుడు నరేష్ -- విష్ణుప్రియ వివాహం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఘనంగా జరిగింది.

వివాహానికి ఆర్థిక సహాయం అవసరం ఉందని నరేష్ మిత్రుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ అడ్వైజరీ కమిటీ మెంబర్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి రూ. 5000/-, అలాగే మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు రూ. 5000/- ఆర్థిక సహాయం అందించారు.

అదేవిధంగా ఏఎంసీ డైరెక్టర్ బలగం రాజేష్ 25 కేజీల బియ్యం, రాజేందర్ మరో 25 కేజీల బియ్యం అందించి వివాహ ఖర్చులకు తోడ్పాటు అందించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇలాంటి సహాయం సమాజంలో ఐక్యతను, మానవత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోతు అశోక్, ఉర్మడ్ల హన్మాండ్లు, అంకం శ్రీనివాస్, భూమల్ల మల్లేష్, బద్ది అంజయ్య, మ్యాకల రాజు, మేదరి శ్యాం, మెట్టు ప్రకాష్,సామల్ ఆశన్న, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్పంచి జన్మదిన వేడుకలు.

**కాల్వ శ్రీరాంపూర్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)**

కాల్వ శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారు రమేష్ .జన్మదిన వేడుకలను .ప్రజలు. నాయకులు .ఘనంగా శుక్రవారం రోజున నిర్వహించారు .కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయనను శాలువలతో ఘనంగా అభినందించారు .ఈ కార్యక్రమంలో .నాయకులు ప్రజలు .అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు





కొడిమ్యాల, ఏప్రిల్ 03,(ప్రజాజ్యోతి):

మండలంలోని నాచుపల్లి బేతేలు బిలివర్స్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ స్టీఫెన్ యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను గుర్తుచేశారు. ప్రభువైన యేసుక్రీస్తు కల్వరి శిలువలో రక్తం చిందించడం వల్ల సర్వమానవాళికి విమోచనం కలిగిందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రార్ధనలు చేశారు.

## కల్వకోట లో డ్రైనేజ్ పనులు ప్రారంభం



మేడిపల్లి ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో శుక్రవారం రోజున 8వ వార్డు లో డ్రైనేజ్ పనులు ప్రారంభించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిల్ల రమేష్,ఉపసర్పంచ్ అదే రవితేజ,వార్డ్ మెంబర్స్ చంద భూమక్క,నామతాబాద్ నవీన్,ఎల్లా రాజేష్,ముజ్జు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొబిన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ యూసుఫ్,గ్రామ ప్రజలు వివిధ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నాసిరకంగా రేషన్ బియ్యంతో జనం పరేషాన్

### నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని కోరుతున్న ప్రజలు

ఎండపల్లి, ఏప్రిల్ 03,ప్రజా జ్యోతి

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో పురుగులు వస్తున్నాయని,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్లపల్లి వాసులు మండిపడుతున్నారు,ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో పురుగులు వస్తున్నాయని. ఆ బియ్యం అన్నం ఎలా తినాలని చర్లపల్లి గ్రామంలో రేషన్ కార్డు లబ్ది దారులు,అధికారుల తీరుపై మండిపడుతున్నారు, శుక్ర వారం రేషన్ షాపులో పంపిణీ చేస్తున్న కేంద్రం వద్ద రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు బియ్యాన్ని పరిశీలించి అవాక్కయ్యారు. బియ్యంలో పురుగులు,కొలతల్లో తేడాలు వస్తున్నాయని,ఆరోపిస్తూ, అధికారులు స్పందించి వెంటనే నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరుతున్నారు,



# ఘోర రోడ్డు ప్రమాదం

**- ఒకరు మృతి ,మరొకరి పరిస్థితి విషమం**

కోరుట్ల మార్చి 03 ప్రజాజ్యోతి

జగిత్యాల జిల్లా కోరుట్ల మండల పరిధిలోని మోహన్‌రావుపేట శివారులో ఈరోజు రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే... కోరుట్ల నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రాత్రి వేళ కావడం, అలాగే రహదారిపై సరైన హెచ్చరిక సూచనలు లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అతన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన వ్యక్తి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**- స్థానికుల ఆవేదన**



ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి సమయంలో లైటింగ్ సదుపాయం లేకపోవడం, రోడ్డు మీద ఆగి ఉన్న వాహనాలకు హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# అసైన్డ్ భూముల వివాదం-సర్పంచ్ భర్తపై దాడి

**- ఇద్దరిపై కేసు నమోదు**

కొడిమ్యాల, ఏప్రిల్ 03,(ప్రజాజ్యోతి):

మండలం అప్పారావుపేట గ్రామంలో అసైన్డ్ భూముల వివాదంలో సర్పంచ్ భర్తపై దాడి ఘటన ఘర్షణకు దారితీసింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎన్‌హెచ్--563 సమీపంలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములను కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నట్లు గ్రామ ప్రజలు సర్పంచ్ బండ వినీలకు తెలియజేయగా ,దీంతో సర్పంచ్ ప్రభుత్వ సర్వేయర్ ద్వారా భూములను కొలిపించి హద్దులు వేయగా, అది ఇష్టం లేని పూడూరు గ్రామానికి చెందిన బండ ఎల్లారెడ్డి, గౌరాపూర్‌కు చెందిన బండ రవీందర్ రెడ్డి ఈ నెల 2న సర్పంచ్ భర్త బండ నరసింహారెడ్డిపై దాడి చేసి గాయపరచడం జరిగిందని,నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.